క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బేస్తవారిపేట: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ షేక్ నీలోఫర్ బేగం తెలిపారు. కార్యకర్తల నియామకానికి సంబంధించి బేస్తవారిపేట–1 అంగన్‌వాడీ కేంద్రంలో బీసీ–ఏ, శింగరపల్లె–1లో బీసీ–బీ, అర్ధవీడు మండలం వెలగలపాయ–2లో బీసీ–బి, కంభం మండలం కాగితాలగూడెంలో బీసీ–ఈ, కందులాపురంలో బీసీ–ఏ పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని వివరించారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 23వ తేదీలోగా పూర్తి చేసిన దరఖాస్తులు బేస్తవారిపేట ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

కరివెన సత్రాల అభివృద్ధికి కృషి



సభ్యులను సన్మానిస్తున్న హరిహరరావు, జగన్ తదితరులు

మార్కాపురం: అఖిల భారతీయ బ్రాహ్మణ కరివెన సత్రాల అభివృద్ధికి కృషి చేస్తామని నూతన వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఎంపికైన భారతుల శ్రీనివాసశాస్త్రి, ఆడిటర్ పీవీఎల్ఎన్ నాగరాజు పేర్కొన్నారు. నూతన వర్కింగ్ కమిటీ సభ్యులుగా వారిని అధ్యక్ష కార్యదర్శులు ఎన్ఆర్ శ్రీనివాస్, డాక్టర్ ఎస్.వేణుగోపాల్ నియమించారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి సాయిబాబా ఆలయంలో వారికి నియామక పత్రాలు అందించి సన్మానించారు. ఘనమైన చరిత్ర కలిగిన కరివెన సత్రాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ సహకరించాలని కోశాధికారి గోపాలుని హరిహరరావు కోరారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కె.రామకృష్ణ, అడ్వైజరీ కమిటీ సభ్యులు టి.నాగజగన్నాథ్, శ్రీనివాస్, శాస్త్రి, కేశవరావు, కమలాపురి శ్రీనివాసులు, డి.మధు, నారాయణాచార్యులు, అశోక్, సాయి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మిరపలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



మిరప తోటను పరిశీలిస్తున్న హెచ్ఓ విష్ణుప్రియ

గిద్దలూరు రూరల్: రైతులు మిరప పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలని స్థానిక ఉద్యానవనశాఖ అధికారి విష్ణుప్రియ పేర్కొన్నారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని వెంగళ్‌రెడ్డిపల్లె గ్రామంలో మిరప తోటలను గురువారం ఆమె పరిశీలించారు. మిరపలో తామర పురుగు, తెల్లదోమ ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి, నివారణ కోసం రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎకరానికి 40 వరకు నీలం, పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. పంటల బీమా చేయించుకోవాలని చెప్పారు. ఉద్యానవన శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ తప్పనిసరి

అర్ధవీడు: మండలంలోని మాగుటూరు గ్రామంలో ఈ క్రాప్ నమోదును గురువారం ఉద్యానవనశాఖ అధికారి డి.శ్వేత పరిశీలించారు. ఈ సందర్భంగా మిరప రైతులకు సూచనలిచ్చారు. నాగులవరం గ్రామంలో పంట నమోదు ప్రక్రియను ఏఓ మహమ్మద్ పర్యవేక్షించారు. రబీ పంటలకు తప్పనిసరిగా ఈ క్రాప్ చేయించుకోవాలని సూచించారు.

మొక్కజొన్న దిగుబడికి ‘కత్తెర’

- రాచర్ల మండలంలో సుమారు 1200 ఎకరాల్లో విత్తన రకం మొక్కజొన్న సాగు
- ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు
- కత్తెర పురుగు ఉధృతితో దిగుబడిపై బెంబేలెత్తుతున్న రైతులు



జేపీ చెరువులో సాగు చేసిన మొక్కజొన్న పంట

రాచర్ల:

వ్యయప్రయాసలకోర్చి రైతులు సాగు చేసిన మొక్కజొన్న.. కత్తెర పురుగు ధాటికి నాశనమవుతోంది. రాచర్ల మండలంలో మొక్కజొన్న పొలాల్లో ఎక్కడ చూసినా కత్తెర పురుగు దర్శనమిస్తూ రైతులను కంగారు పెడుతోంది. మొక్కజొన్న కాండంతో పాటు ఆకులను పూర్తిగా తీనేస్తున్న కత్తెర పురుగును కట్టడి చేయడం రైతులకు తలకు మించిన భారంగా మారింది. పంటను కాపాడుకునేందుకు ఎన్ని రకాల రసాయన ఎరువులు, పురుగు మందులు వాడినా కత్తెర పురుగు అదుపులోకి రాకపోతుండటం రైతులను మరింత కలవరపాటుకు గురిచేస్తోంది.

రాచర్ల మండలంలోని ఆరవీటికోట, కోత్తూరు,ఆకవీడు, చినగానిపల్లె, జేపీ చెరువు, చోళ్లవీడు, అచ్చంపేట, అక్కపల్లె, సత్యవోలు, రాచర్ల ఫారం తదితర గ్రామాల్లో వ్యవసాయ బోర్ల కింద విత్తన రకం మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు. పలు ప్రైవేట్ కంపెనీలు పంట దిగుబడిని తామే కొనుగోలు చేస్తామన్న ఒప్పందంతో రైతులకు విత్తనాలు, స్వల్ప మోతాదులో మందులు ఉచితంగా ఇచ్చి మొక్కజొన్న సాగు చేయించాయి. రెండు నెలల క్రితం ఆయా గ్రామాల్లో దాదాపు 1200 ఎకరాల్లో మొక్కజొన్న వేసిన రైతులు కంటి రెప్పలా పంటను కాపాడుకుంటూ వస్తున్నారు. పందుల బెడద కారణంగా పొలాల్లోనే జాగారం చేస్తున్నారు.

పెట్టుబడి చేతికొచ్చేనా?

విత్తన మొక్కజొన్న సాగుతో ఆదాయం బాగుంటుందన్న ఆశతో రాచర్ల మండలంలోని వందలాది మంది రైతులు ఇటువైపు దృష్టి సారించారు. రెండు నెలల వ్యవధిలో ఒక్కో ఎకరానికి రూ.30 వేలు పెట్టుబడి పెట్టారు. నెల రోజుల వరకు పచ్చగా కళకళలాడుతున్న తోటలను చూసి సంతోషించిన రైతులను రోజుల వ్యవధిలోనే కత్తెర పురుగులు తత్తరపాటుకు గురిచేశాయి. మొక్కజొన్న ఆకులపై గూళ్లు ఏర్పాటు చేసుకున్న పిల్ల పురుగులు లేత ఆకులను తింటూ చిన్న చిన్న రంధ్రాలు చేస్తున్నాయి. ఇవి క్రమంగా కాండంలోకి చొచ్చుకెళ్లి అంకురాన్ని తినడం వల్ల మొవ్వ చనిపోతుందని రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతన్నారు. ప్రస్తుతం కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్న పొలాల్లో రైతులు రసాయన మందును మొవ్వల్లో(సుడులు) పోస్తున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో రైతుల బాధ వర్ణనాతీతంగా మారింది. ఓ వైపు అడవి పందులు, మరో వైపు కత్తెర పురుగులు మొక్కజొన్నను నాశనం చేస్తుండటంతో పెట్టుబడి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి సహకరించి, తెగుళ్ల బెడద పెద్దగా లేకుంటే మొక్కజొన్న దిగుబడి 17 నుంచి 20 క్వింటాళ్ల వరకు వస్తుందని అంచనా. కత్తెర పురుగు ఉధృతంగా ఉండటంతో కనీసం 10 క్వింటాళ్లు కూడా దిగుబడి వచ్చే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు.



మొక్కజొన్న పంటకు సోకిన కత్తెర పురుగులు



మొవ్వలను తిన్న కత్తెర పురుగు

మందులు కొట్టినా మళ్లీ వస్తోంది



నేడు రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. మొదట్లో కత్తెర పురుగు బెడద ఎక్కువగా ఉంది. పురుగులను కట్టడి చేసేందుకు రసాయన మందులను పిచికారీ చేశా. కొన్ని రోజులపాటు పంట బాగానే ఉంది. కానీ మళ్లీ కత్తెర పురుగులు ఆశించాయి. రసాయణ మందులను కలిపి మొక్కల మొవ్వల్లో పోస్తున్నాం. పురుగు ఉధృతిని చూస్తుంటే దిగుబడి రాదేమోనని ఆందోళనగా ఉంది.

– మేకల చిన్న వెంకటేశ్వర్లు, జేపీ చెరువు, రైతు

బీమా చేయించుకోండి

విత్తన మొక్కజొన్న సాగు చేసిన రైతులు సంబంధిత సంస్థతో తప్పనిసరిగా అగ్రిమెంట్ చేసుకోవాలి. పంటలో కత్తెర పురుగును గుర్తిస్తే సకాలంలో నివారించుకోవాలి. పురుగు ఉధృతి ఎక్కువైతే సుడుల్లో గుళికలు వేసుకోవాలి. మొక్కజొన్న రైతులు తక్షణమే ఎకరాకు రూ.105 చెల్లించి పంటల బీమా చేయించుకోవాలి.

– అబ్దుల్ రఫీ, ఏఓ, రాచర్ల

ప్రారంభానికి నోచుకోని ప్రభుత్వ భవనాలు



ప్రారంభానికి సిద్ధంగా రైతు సేవా కేంద్రం



వైరింగ్, ఫ్లంబింగ్ పనులు మిగిలిన సచివాలయం

- ఇడుపూరులో నిరుపయోగంగా రైతు సేవా కేంద్రం, గ్రామ సచివాలయం

మార్కాపురం: మండలంలోని ఇడుపూరు గ్రామంలో నిర్మించిన రైతు సేవా కేంద్రం, గ్రామ సచివాలయ భవనాలు ప్రారంభానికి నోచుకోక పాలకుల నిర్లక్ష్యానికి సాక్షిగా నిలుస్తున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో రైతులకు సేవలు అందించేందుకు రైతు భరోసా కేంద్రం(ప్రస్తుతం రైతు సేవా కేంద్రం), గ్రామ సచివాలయం, ఆరోగ్య ఉపకేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఇడుపూరు గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో సచివాలయాన్ని, రూ.20.5 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని, రూ.21.8 లక్షలతో హెల్త్ క్లినిక్ నిర్మాణం చేపట్టారు. అయితే రైతు సేవా కేంద్రం నిర్మాణం పూర్తి కాగా సచివాలయంలో విద్యుత్ వైరింగ్, ఫ్లంబింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వీటిని గాలికి వదిలేయడంతో ప్రారంభానికి నోచుకోక పాలకుల నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తున్నాయి. అధికారులు మాత్రం ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి. భవనాలను అందుబాటులోనికి తెస్తే తమకు ఉపయోగకరంగా ఉంటుందని, అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడు అరెస్ట్

గిద్దలూరు రూరల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం అరెస్టు చేసి, అతని వద్ద ఉన్న 9 క్వార్టర్లు సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ జయరావు తెలిపారు. అందిన సమాచారం మేరకు సోదాలు నిర్వహించగా మద్యం పట్టుబడిందని సీఐ చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బేస్తవారిపేట: మండలంలోని అక్కపల్లె సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనులు నిర్వహిస్తున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ సన్యాసిరావు తెలిపారు. అక్కపల్లె, పీపీ పురం, బసినేపల్లె, గంటాపురం, ఖాజీపురం, ఎంపీ చెరువు, కొత్తపేట, చెరుకుపల్లె, జెన్నివారిపల్లె, గలిజేరుగుళ్ల గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఏఈ కోరారు.



అలసంద కాయలు కోస్తున్న కూలీలు

ఆగకుంటే అనర్థమే..

- అల్పపీడన ప్రభావంతో ఆకాశం మేఘావృతం
- ముసురు పట్టడంతో రైతుల్లో ఆందోళన

కొనకనమిట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన మరో అల్పపీడనం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. వాతావరణ ప్రభావంతో గురువారం ముసురు పట్టడంతో కోత దశలో ఉన్న పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఖరీఫ్, రబీలో సాగుచేసిన పత్తి, అలసంద, మినుము, వేరుశనగ కోతలు ప్రారంభమయ్యాయి. గురువారం మోస్తరు జల్లులు కురవడంతో పొలాల్లో మినుము ఓదెలు తడవకుండా కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీశారు. గట్టి జల్లులు పడితే పొగాకు నాణ్యత తగ్గుతుందని రైతులు మదనపడుతున్నారు. ఈ నెలాఖరువరకు వర్షం కురకుండా ఉంటే పంట కోతలు చాలా వరకు పూర్తవుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.



ముసురుతో మినప పంట గూళ్లు వేస్తున్న రైతులు

నేతపాలెంలో సమస్యల తిష్ట



రోడ్డుపై చేరిన మురుగు



బెత్తెడు ఎత్తులో కుళాయిలు

పొదిలి: ఎదురుగా ద్విచక్ర వాహనం వస్తుంటే, మరో వాహనం పోయేందుకు అవకాశం లేని రోడ్లు, వీధుల్లోనే మురుగు ప్రవాహం.. బెత్తెడు ఎత్తులో మంచినీటి కుళాయిలు.. ఇదీ పొదిలి పట్టణంలోని నేతపాలెంలో పరిస్థితి. సమస్యలతో సహవాసం చేస్తున్న వారి ఆవేదనను ఏ అధికారీ పట్టించుకోవడం లేదు. నేతపాలేనికి తూర్పు, దక్షిణం వైపున ఉన్న భూములకు మెరక తోలడం, కాలువలు పూడ్చి వేయడంతో మురుగు ముందుకు వెళ్లే మార్గం లేక ఎక్కడికక్కడే నిల్వ ఉంటోంది. దీంతో దోమలు వృద్ధి చెంది స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. తుప్పు పట్టిన పైపుల్లో మంచి నీరు సరఫరా అవుతుండటంతో తరచూ నీరు కలుషితమై వస్తున్నాయి. కుళాయిలు బెత్తెడు ఎత్తులో ఉండటంతో గిన్నెలతో నీరు పట్టుకుని బిందెలు నింపుకోవాల్సిన దుస్థితి. కొన్ని చోట్ల మురుగు కాలువల్లోనే మంచినీటి పైపులు ఉన్నాయి. ఇరుకు రోడ్లు కావడంతో మంచినీటి ట్యాంకర్లు వెళ్లేందుకు కూడా అవకాశం లేదు. ఎన్ని పర్యాయాలు అధికారులకు విన్నవించినా, రోడ్డెక్కి నిరసన తెలిపినా సమస్యలకు మాత్రం పరిష్కారం లభించడం లేదని నేతపాలెం వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌తో ఉద్యోగావకాశాలు



జాతీయ కంపెనీల ప్రతినిధులతో డాక్టర్ షంషేర్ అలీబేగ్

మార్కాపురం రూరల్: కమ్యూనికేషన్ స్కిల్స్‌తో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్ పేర్కొన్నారు. గురువారం ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ విభాగాల విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని సూచించారు. ఏటా జాతీయ స్థాయి కంపెనీలతో ప్లెసుమెంట్లు నిర్వహించేలా ఒప్పందాలు చేసుకుంటున్నట్లు చెప్పారు. వివిధ కంపెనీల ప్రతినిధులు అలోక్‌పాండే, రాకేష్ సింగ్, లక్ష్మీ నరసింహం తదితరులు ప్లేసుమెంట్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ మసూద్ అలీబేగ్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, ప్లేసుమెంట్ ఆఫీసర్ డాక్టర్ లత, హెచ్ఓడీలు షేక్ మహమ్మద్ రఫీ, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాలల ‘చలో గుంటూరు’కు తరలిరండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు సభ్యులు

మార్కాపురం: రాజ్యాంగ పరిరక్షణ, ఎస్సీలకు జరుగుతున్న అన్యాయంపై ఈ నెల 15న గుంటూరులో జరగనున్న చలో గుంటూరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు అశోక్‌బాబు పిలుపునిచ్చారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ, క్రీమిలేయర్ వల్ల దళితుల మధ్య ఐక్యత దెబ్బతిన్నదని, భవిష్యత్తులో రాజ్యాంగ హక్కులకు దూరమయ్యే ప్రమాదం ఉందని, ఎస్సీ జనాభా పెరిగిన దృష్ట్యా అందుకు అనుగుణంగా రిజర్వేషన్ శాతం కూడా పెంచాలని, దళిత క్రైస్తవులకు రిజర్వేషన్ కల్పించేంత వరకు ఈ పోరాటం కొనసాగిస్తామన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు అంబేడ్కర్ విగ్రహం వద్ద హలో మాల.. ఛలో గుంటూరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు జనుమాల నాగయ్య, నూతలపాటి రాజు, నాగయ్య, కూకట్లపల్లి అబ్బన్న, గొట్టిముక్కల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సభలో 32 అర్జీలు



రస్తా చూపుతున్న తహసీల్దార్ చిరంజీవి



హజరత్‌గూడెంలో అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్

గిద్దలూరు రూరల్: మండలంలోని కె.ఎస్.పల్లె గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సభలో వివిధ సమస్యలపై 32 అర్జీలు అందాయని తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి తెలిపారు. సభలో ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఆర్ఐ భాస్కర్ రావు, వీఆర్ఓ వై.పి.రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

హజరత్‌గూడెంలో 19 అర్జీలు

కంభం: మండలంలోని హజరత్ గూడెం, కాగితాల గూడెం రెవెన్యూ పరిధిలో గురువారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. హజరత్‌గూడెం రెవెన్యూ పరిధిలో 6, కాగితాల గూడెం రెవెన్యూ పరిధిలో 13 అర్జీలు వచ్చినట్లు అధికారులు వివరించారు. సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ కిరణ్ చెప్పారు.

వివాదాస్పద రస్తా సమస్య పరిష్కారం

మార్కాపురం రూరల్: మండలంలోని గజ్జలకొండ గ్రామంలో గురువారం తహసీల్దార్ చిరంజీవి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్జలకొండకు చెందిన కొందరు తమను రస్తా నుంచి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్నారని అర్జీ ఇవ్వడంతో తహసీల్దార్, సర్వేయర్ సమక్షంలో కొలతలు వేసి సమస్యను పరిష్కరించారు.

సేవా దృక్పథంతో పని చేయాలి

- డీఐఎంహెచ్ఓ సృజన



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న సృజన, డాక్టర్లు

కొనకనమిట్ల: తమ వృత్తిలో సేవా దృక్పథంతో పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని కనిగిరి డీఐఎంహెచ్ఓ సృజన పేర్కొన్నారు. మండలంలోని గొట్లగట్టు ప్రాథమిక వైద్యశాల డాక్టర్ పృథ్వీరాజ్ ఉన్నత చదువుల నిమిత్తం బదిలీపై వెళ్తున్న క్రమంలో గురువారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పీజీ పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం సెమీక్రిస్మస్ వేడుకల్లో భాగంగా డాక్టర్లు ఎస్పీ. బాలయ్య, పృథ్వీరాజ్, నరేంద్రతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో దర్శి, ఉప్పలపాడు, హనుమంతునిపాడు పీహెచ్‌సీల వైద్యులు శంకర్‌నాయక్ తేజ, రుచిత, హెచ్ఈఓ నారాయణరెడ్డి, స్థానిక వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

18న యూత్ క్రిస్మస్ వేడుకలు



యూత్ క్రిస్మస్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

మార్కాపురం: ఈనెల 18వ తేదీన యూత్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చి యూత్ డైరెక్టర్ దేవరకొండ సామ్య తెలిపారు. గురువారం స్థానిక చర్చి ఆవరణలో యూత్ క్రిస్మస్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. 18వ తేదీన ఏబీఎం కాంపౌండ్‌లో గల తెలుగు బాప్టిస్టు చర్చి ఆవరణలో సాయంత్రం 6 గంటలకు యూత్ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి విజయవాడకు చెందిన పాల్ ఇమ్మానియేల్ ముఖ్య ప్రసంగీకులుగా హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, 16వ వార్డు కౌన్సిలర్ దారివేముల హర్షిత, సాగర్, జాన్, భాస్కర్, డెన్నీస్, రిన్ని, విజ్ఞత, విమల జోషిత, కీర్తన, సోనీ, తేజ, సాదీప్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.